క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

నార్కట్‌పల్లి : వాసవి క్లబ్ నార్కట్‌పల్లి పట్టణ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వైస్ గవర్నర్లు వీరెల్లి సతీష్, తాళ్లపల్లి రాములు తెలిపారు. నార్కట్‌పల్లి వాసవి క్లబ్ ప్రెసిడెంట్‌గా పల్లెర్ల ప్రవీణ్, సెక్రటరీగా మంచుకంటి సంతోష్, ట్రెజరర్‌గా గర్రె వెంకన్నలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవరశెట్టి నారాయణ, బిళ్లకంటి శ్రీకాంత్, నూనె కిషోర్, మందారు రమేష్, తదితరులు ఉన్నారు.

31న వ్యాస రచన పోటీలు

నార్కట్‌పల్లి : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన సందర్భంగా ఈ నెల 31వ తేదీన మండల స్థాయి వ్యాస రచన పోటీలను నార్కట్‌పల్లి హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండీ సర్వర్ అలీ, నాతి పరుశురాములు గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు పాల్గొనాలని కోరారు. పోటీలో పాల్గొనాలనుకునే విద్యార్థులు 9059872054 నంబర్‌లో సంప్రదించాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

మంత్రి ఆర్థికసాయం

కనగల్ : మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వారి కుటుంబాలకు రూ.10,000 చొప్పున గ్రామ కాంగ్రెస్ నాయకులతో గురువారం పంపించారు. పగిడిమర్రి రాము, అద్దంకి లింగయ్య కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోయగుర అంజిరెడ్డి, మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాలిగౌరారం: మండలంలోని బండమీదిగూడెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులను గురువారం డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి అంజయ్య, వీరారెడ్డి, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై చిన్నచూపు చూస్తున్న కేంద్రం

కేతేపల్లి : కేంద్ర ప్రభుత్వం వరి పంటపై చిన్న చూపు చూస్తోందని పీసీసీ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కేతేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా వరి పంట పండించి దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. వరికి మద్దతు ధర రూ.69 మాత్రమే ప్రకటించి కేంద్రం చిన్న చూపు చూసిందన్నారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం వరికి రూ.2800 మద్దతు ధర ఇస్తేనే రైతుకు గిట్టుబాటు ఉంటుందన్నారు. కేంద్రం పునరాలోచన చేసి వరికి మద్దతు ధర పెంచాలని కోరారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

కట్టంగూర్ : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జూన్ 22, 23 తేదీల్లో కట్టంగూర్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున కోరారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలో జరిగిన కేవీపీఎస్ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, గాదె నర్సింహ, మల్లన్న, రవీందర్, శ్యామ్, రవి, రాధిక, జాల రమేష్, శైలజ, ముసుకు రవీందర్ పాల్గొన్నారు.

నేడు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల, తాళ్లవెల్లంల, నేరడ, ఎలికట్టె, వనిపాకల, శివనేనిగూడెం, వట్టిమర్తి గ్రామాలకు శుక్రవారం సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయనున్నట్లు విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఐటీయూ నాయకుడు మృతి

గట్టుప్పల్ : మండల కేంద్రానికి చెందిన సీఐటీయూ జిల్లా నాయకుడు కకునూరి నగేష్ (38) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, జెర్రిపోతుల ధనంజయ్య, కర్నాటి సుధాకర్, రబ్బానీ, కర్నాటి వెంకటేశం, వెంకట్‌రెడ్డి, అచ్చిన శ్రీనివాస్, శంకరప్ప, భిక్షం తదితరులు నివాళులర్పించారు.

తహసీల్దార్‌కు సన్మానం

మర్రిగూడ : నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జక్కర్తి శ్రీనివాసులును గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు కుమారస్వామిచారి, బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, నాయకులు జమ్ముల వెంకటేష్‌గౌడ్, పంగ యాదయ్య, శోభన్‌బాబు, దామోదర్, సతీష్, శ్రీరాంగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. క్రీడలకు ఊతం



ఉరుమడ్లలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో జిల్లా యువజన క్రీడల అధికారి



ఉరుమడ్లలో శిక్షణ శిబిరంలో హాకీ ఆడుతున్న క్రీడాకారులు

- ఉరుమడ్ల శిబిరంలో హాకీ శిక్షణ
- జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు
- నేటితో ముగియనున్న శిక్షణ శిబిరం

చిట్యాల: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులు, యువతీ యువకులు వివిధ క్రీడల్లో ప్రావీణ్యం, నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతి వేసవి కాలంలో డీవైఎస్‌ఓ(జిల్లా యువజన క్రీడల శాఖ) ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో మూడేళ్లుగా హాకీ క్రీడలో క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. మే 1వ తేదీన ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం ఈ నెల 30వ తేదీతో ముగియనుంది.

హాకీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ఉరుమడ్ల గ్రామంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో హాకీ క్రీడలో అరవై మంది వరకు ఉరుమడ్ల, చిట్యాల, ఎలికట్టె గ్రామాలకు చెందిన క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు కోచ్ గంగాపురం రాము ఆధ్వర్యంలో హాకీలో మెళకువలను క్రీడాకారులు నేర్చుకుంటున్నారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు డీవైఎస్‌ఓ ఆధ్వర్యంలో హాకీ స్టిక్‌లు సమకూర్చారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పలువురు గ్రామస్తులు అవసరమైన పౌష్టికాహారం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. క్రీడాకారులకు గుడ్లు, పండ్లు వంటి వాటిని ప్రతిరోజు అందిస్తున్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చుకుంటున్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఉరుమడ్ల గ్రామంలో మూడేళ్లుగా నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన పదిమంది క్రీడాకారులు రాష్ట్ర, జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వై.శ్రీలక్ష్మీచందన, సోను సోయల్, ఆర్.భవ్యశ్రీ, పి.సహస్ర, కె.అఖిల్ నందన్, ఆర్.సాయి చరణ్‌తేజ్, ఆర్. అశ్విత, ఎస్.కె.ఆయేషా, కె.తనివిశ్రీ, జిల్లాస్థాయి పోటీలకు రాచమల్ల అఖిలేష్ ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా



ఉరుమడ్లలో నిర్వహిస్తున్న హాకీ వేసవి శిక్షణ శిబిరంలో మొదటి రోజు నుంచి పాల్గొంటున్నా. నాకు హాకీ క్రీడలో రాష్ట్రస్థాయిలో ఆడాలనే కోరిక ఉండేది. హాకీ క్రీడలో ఉరుమడ్ల శిబిరంలో ఉచితంగా మూడేళ్లుగా శిక్షణ పొందుతున్నా. కోచ్ మాకు హాకీ క్రీడలోని మెళకువలను నేర్పుతున్నారు. పలుమార్లు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా.

– వై.శ్రీలక్ష్మీచందన, 9వ తరగతి, ఎలికట్టె, చిట్యాల మండలం

జిల్లా జట్టుకు ఎంపికయ్యా



మా గ్రామంలో వేసవికాలంలో ఉచితంగా నిర్వహిస్తున్న హాకీ క్రీడా శిబిరంలో పాల్గొంటున్నా. క్రీడా పరికరాలను ఇవ్వడంతో పాటు కోచ్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా హాకీలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. ఈ వేసవి హాకీ క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రతి వేసవిలో కొనసాగించాలి.

– రాచమల్ల అఖిలేష్,7వ తరగతి, ఉరుమడ్ల, చిట్యాల మండలం

60 మంది వరకు శిక్షణ తీసుకుంటున్నారు



ఉరుమడ్ల గ్రామంలో ఈ నెల 1వ తేదీ నుంచి డీవైఎస్‌ఓ ఆధ్వర్యంలో హాకీ క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. ఈ శిబిరంలో ప్రతిరోజు 60 మంది వరకు యువతీ యువకులు, చిన్నారులు పాల్గొంటున్నారు. గ్రామంలోని యువకులు సహకరిస్తూ శిక్షణ పొందుతున్న వారికి ఉచితంగా పౌష్టికాహారం అందజేసేందుకు ముందుకు వస్తున్నారు.

– గంగాపురం రాము, కోచ్, ఉరుమడ్ల, చిట్యాల మండలం

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ పరుశురాం

తిప్పర్తి : విత్తనాల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించొద్దని తిప్పర్తి తహసీల్దార్ పరుశురాం అన్నారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలను విక్రయించకూడదని ఆదేశించారు. అలా చేసిన వారిపై పీడీ యాక్టు నమోదు చేయడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్ చేయరాదన్నారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ సన్నిరాజు మాట్లాడుతూ ప్రతి డీలర్ స్టాక్ బుక్, రికార్డులు సరిగ్గా నిర్వహించాలన్నారు. తనిఖీ అధికారులకు సహకరించాలని, రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంమూర్తి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్ డ్రైవర్



డ్రైవర్ పాషాను అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

నకిరేకల్ : పట్టణంలోని రహిమత్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ పాష నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. నకిరేకల్‌లోని రహిమత్ నగర్‌కు చెందిన పాషా సూర్యాపేట ఆర్టీసీ డిపోలో బస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సూర్యాపేట–హైదరాబాద్ బస్ సర్వీస్ నడుపుతున్నాడు. ఈ నెల 25న హైదరాబాద్ నుంచి వస్తున్న సూర్యాపేట ఆర్టీసీ బస్‌లో సూర్యాపేటకు చెందిన రామిశెట్టి శాంతకుమారి పెళ్లికి సంబంధించి వస్తువులను తీసుకుని వచ్చింది. ఒక బ్యాగ్‌లో ఆరు తులాల బంగారం ఆభరణాలు ఉన్నాయి. సదరు మహిళ బంగారం ఉన్న బ్యాగ్‌ను సూర్యాపేటలో బస్‌లోనే మరిచిపోయి వెళ్లింది. బస్ డిపోకు వెళ్లిన తరువాత గమనించగా డ్రైవర్ పాషాకు బ్యాగ్ కనిపించింది. దానిని తెరిచి చూడగా మొబైల్ ఫోన్, 6 తులాల బంగారం కనిపించింది. బ్యాగ్‌ను డ్రైవర్ పాష డిపో మేనేజర్‌కు అందజేశారు. విచారించిన అనంతరం బంగారాన్ని సదరు మహిళకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న డ్రైవర్ పాష, కండక్టర్ అంజయ్యను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హైదరాబాద్‌కు పిలిపించి సత్కరించారు.

కాంగ్రెస్ నాయకుడికి ఇంపాక్ట్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న శంకర్

కనగల్: మండలంలోని జీ యడవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొరివి శంకర్ ఇంపాక్ట్ సర్టిఫికెట్ అందుకున్నారు.ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలపై నల్లగొండలో నిర్వహించిన నెలరోజుల శిక్షణ పూర్తి చేసుకుని గురువారం ఆ సంస్థ ప్రతినిధి నూనె సుదర్శన్, లయన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు మదన్‌మోహన్ చేతుల మీదుగా శంకర్ సర్టిఫికెట్ అందుకున్నారు.

టీ తాగుతూ కాసేపు ఉల్లాసంగా..

నార్కట్‌పల్లి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి ఖమ్మం జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లి సమీపాన గల వివేరా హోటల్‌లో కొద్దిసేపు ఆగారు. టీ తాగుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దైద రవీందర్, నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డిలతో కాసేపు ముచ్చటించారు.



టీ తాగుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

• పైప్‌లైన్ పనులు అస్తవ్యస్తం

మునుగోడు: మండల పరిధిలోని సింగారం గ్రామంలో కృష్ణా నీటి పైపులైన్ పనులు అస్తవ్యస్తంగా మారాయి. కనీసం మూడు అడుగుల లోతులో వేయాల్సిన పైపులైన్ కేవలం ఒక అడుగు లోతు వరకు మాత్రమే గాతు తవ్వి వేస్తున్నారు. ఆ పైపులైన్‌పై ఏదైనా భారీ వాహనం వెళితే పగిలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం పైపులైన్ పనులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఒక అడుగు లోతులోనే వేసిన కృష్ణా నీటి పైప్ లైన్

31న గ్రామ దేవతల విగ్రహాల పునః ప్రతిష్ఠాపన మహోత్సవం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ ముత్యాలమ్మ, మారెమ్మ, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ, ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా ఆలయాల్లో నూతన విగ్రహాల పునః ప్రతిష్ఠాపన వేడుకలను బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామ దేవతల పునః నిర్మాణ ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 30న గణపతి పూజ, స్థాపిత మంటప దేవతాపూజలు, ధాన్యాదివాసం, హోమాలు, మూలమంత్ర హోమాలు, సర్వ దేవతాహోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31న ఆయా ఆలయాల్లో నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన అష్టదిక్పాలక బలిహరణ, దృష్టి కుంభం, మహా కుంభప్రోక్షణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి దేవతలకు మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలు సమర్పించాలని కోరారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



క్రీడాకారులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్ : మంచిర్యాలలో ఈ నెల 24 నుంచి 27 వరకు టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టైసన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మిర్యాలగూడకు చెందిన ఎస్.కె.పర్హా బాతుల్, ఎస్.కె.రహీమున్నీసా పాల్గొని బంగారు పతకాలు సాధించారు. వారితోపాటు ఇటీవల నిర్వహించిన సీఎం కప్ యోగాలో ప్రతిభ చూపి కాంస్య పతకాలు పొందిన వారు గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిశారు. వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, కోచ్ రవి, నాగార్జున, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మర్రిగూడ : కొట్టాలలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.

మర్రిగూడ మండలంలోని కొట్టాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో 55 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా గురువారం కలెక్టర్ గ్రామానికి చేరుకుని ఇళ్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 18 ఇళ్లకు బేస్‌మెంట్ పూర్తి చేయగా పది మంది లబ్ధిదారులకు బిల్లులు మంజూరయ్యాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగానే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, చండూరు ఆర్డీఓ రమణారెడ్డి, మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చినముసయ్య, ఎంపీఓ రవికుమార్, ఆర్ఐలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం, నందికొండ లింగారెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

చండూరు : ఇందిరమ్మ ఇళ్లకు పైలెట్ గ్రామంగా ఎంపికైన చండూరు మండలంలోని ఉడుతలపల్లిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో ముచ్చటించారు. గ్రామంలో 65 ఇళ్లు మంజూరు కాగా 18 మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, ఇద్దరికి బేస్‌మెంట్ లెవల్ వరకు లక్ష రూపాయలు బిల్లు చెల్లించినట్లు కలెక్టర్‌కు ఎంపీడీఓ వివరించారు. మిగిలిన వారు కూడా త్వరగా ఇంటి నిర్మాణం ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో చండూరు ఇన్‌చార్జ్ ఆర్డీఓ రమణారెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పనులు త్వరగా పూర్తిచేయాలి

నాంపల్లి : భవిత కేంద్రం పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న భవిత కేంద్రం పనులను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ర్యాంపు, యాక్టివిటి గది, టాయిలెట్స్ ఇతర వసతులపై ఆరా తీశారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, చండూర్ ఇన్‌చార్జ్ ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ వెంకన్న, ఆర్ఐ విజయ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

నల్లగొండ టౌన్: డీఈఓ భిక్షపతిపై కొందరు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన సేవా సంఘం, మాదిగ సంఘాల జేఏసీ, మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘం, దళిత విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాశాఖ అధికారిగా ఉత్తమ సేవలు అందించి ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్న భిక్షపతిపై కొందరు దళిత సంఘాలను అడ్డం పెట్టుకుని ఇబ్బందులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పెరికరం జయరాజ్, కత్తుల షణ్ముఖకుమార్, కత్తుల జగన్‌కుమార్, కత్తుల తులసీదాస్, చింత శివరామకృష్ణ, భాషా పాక హరికృష్ణ, గోలి సైదులు, దుబ్బ రూప, కందుల లక్ష్మయ్య, బొజ్జ శంకర్, ఇరిగి ప్రసాద్ పాల్గొన్నారు.

బదిలీలు నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీఓ నాయకులు

మునుగోడు: మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులను బుధవారం కలెక్టర్ బదిలీ చేయగా ఆ బదిలీలు నిలిపివేయించాలని కోరుతూ టీఎన్జీఓ జిల్లా నాయకులు గురువారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి విన్నవించారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మునుగోడు మండలంలో పనిచేసుకుంటూ నల్లగొండలో కుటుంబాలతో స్థిరపడిన కార్యదర్శులను దూర ప్రాంతమైన నేరేడుగొమ్ము మండలానికి బదిలీ చేయడంతో ఆ కుటుంబాలు ఇబ్బందులు పడతాయని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు తమ సొంత డబ్బులు ఖర్చు చేశారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. బదిలీల విషయంలో అధికారులతో చర్చిస్తానని, గ్రామాల్లో ఖర్చు చేసిన డబ్బులు ఎంపీడీఓతో ధృవీకరించుకుని తీసుకొస్తే ఆ డబ్బులు తానే సొంతగా చెల్లిస్తానని అన్నారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టీఎన్జీఓ అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి జే.శేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఏ.వెంకట్‌రాంరెడ్డి, రణదేవ్, ప్రదీప్, ఖాసీం తదితరులు ఉన్నారు.

‘యువ వికాసం’ అర్హుల జాబితా అందజేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి

తిప్పర్తి : బ్యాంకర్లు సిబిల్ స్కోర్ వివరాలు పూర్తిచేసి రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల జాబితా త్వరగా అందజేయాలని తిప్పర్తి ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి బ్యాంకర్లను కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హుల జాబితాను మండల కమిటీ ద్వారా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. తిప్పర్తి మండలంలో రాజీవ్ యువ వికాసం పథకం రూ.50వేల యూనిట్‌లు మొత్తం 112 ఉండగా 52 మంది దరఖాస్తులు చేసుకున్నారని, లక్ష రూపాయల యూనిట్ 102 ఉండగా 34మంది, రెండు లక్షల రూపాయల యూనిట్‌లు 86 ఉండగా 188 మంది దరఖాస్తులు చేసుకున్నారని, 4 లక్షల యూనిట్‌లు 81 ఉండగా 1211 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా బ్యాంకుల మేనేజర్‌లు బి.లక్ష్మణ్, రాజశేఖర్, దివ్య భారతి, రంజిత్, కార్పొరేషన్ అధికారులు యూనుస్, సోమరాజు, సూపరింటెండెంట్ అల్తాఫ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన కరపత్రాల ఆవిష్కరణ

గట్టుప్పల్ : మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పార్వతీదేవి ఆలయంలో ఈ నెల 31న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణ దాత రాపోలు మధుసూదన్, అర్చకుడు రమణతో కలిసి ఆవిష్కరించారు. మహోత్సవాలు జూన్ 2 వరకు కొనసాగుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు నేడు ధర్నా

రామగిరి (నల్లగొండ): ఉపాధి హామీ చట్టం రక్షణ, కూలీల సమస్యల పరిష్కారానికి శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను పరిశీలించి మాట్లాడారు. పేదలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య పోరాటంతో తెచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిధులు తగ్గిస్తూ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కట్ట అంజయ్య, గోలి నరసింహ, పద్మ, రాజు, వెంకటమ్మ, రాములు సరస్వతి, యాదమ్మ పాల్గొన్నారు.

మునుగోడు: ఉపాధిహామీ పథకాన్ని కాపాడుకునేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించనున్న ధర్నాకు కూలీలు భారీ సంఖ్యలో తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కోరారు. గురువారం ధర్నాకు సంబంధించిన కరపత్రాని మునుగోడులో ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బండా శ్రీశైలం, సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్, యసరాని శ్రీను, వేముల లింగస్వామి, ఎండీ సిద్దిక్, నరేష్, యాట గణేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు: ధర్నా కరపత్రాన్ని విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

చెరువుల పరిశీలన

శాలిగౌరారం: మూసీనది నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చిచేరే రాచకాల్వకు అనుసంధానంగా ఉన్న మండలంలోని ఎన్‌జి కొత్తపల్లి గ్రామంలో గల కందికుంట, గారెకుంట చెరువులను నీటిపారుదల శాఖ ఏఈ విక్రమ్ గురువారం పరిశీలించారు. నెల రోజులుగా రాచకాల్వ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో రాచకాల్వకు అనుసంధానంగా ఉన్న కందికుంట, గారెకుంట చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయి. దీనికి తోడు రెండు రోజుల క్రితం మండలంలో కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరగడంతో కందికుంట, గారెకుంట చెరువు కట్టలు జాలువారుతూ ప్రమాదకరంగా మారాయి. రైతులు ఇచ్చిన సమాచారంతో ఆయా చెరువు కట్టలను ఏఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఏఈ వెంట శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు రైతు ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేశ్, కాంగ్రెస్ నాయకులు లోడంగి మహేశ్, సంకటి శ్రీను, లింగయ్య, ఓగోటి శంకర్ తదితరులు ఉన్నారు.